అధ్వానంగా బోధన్ బస్టాండ్

- ప్రయాణ ప్రాంగణం ఆవరణలో నీటి గుంతలు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు


ప్రయాణ ప్రాంగణం వద్ద కంకరతేలిన రోడ్డు


బోధన్ బస్టాండ్ కొత్త భవనం ఆవరణలో బురద నీటి గుంతలు

బోధన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ విస్తరణలో భాగంగా కొన్నేళ్ల క్రితం అదనపు సముదాయాన్ని నిర్మించారు. కానీ ఈ సముదాయం ఎదుట సీసీ రోడ్డు లేక గుంతలు ఏర్పడ్డాయి. వర్షపు నీరు ఆయా గుంతల్లో చేరి, పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. ఈ బస్టాండ్ మీదుగా నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈక్రమంలో ప్రయాణికులు బస్సులు ఎక్కే, దిగే సమయంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. బురద గుంతల్లోంచే బస్సుల రాకపోకలు సాగుతున్నాయి. ఇటీవల డిపో అధికారులు గుంతలు పూడ్చేందుకు ప్రయత్నాలు చేశారు. అయినా బస్టాండ్‌లో పరిస్థితి మారడం లేదు.

రూ. 50లక్షలతో బస్టాండ్ విస్తరణ..

1985–86 ఏడాదిలో బోధన్ డిపో ఏర్పాటు జరిగింది. అదే సమయంలో బోధన్‌- నిజామాబాద్ వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన రేకుల షెడ్డు నిర్మించి బస్టాండ్ ప్రారంభించారు. ఆ తర్వాత కొన్నేళ్లకు ఆరు ప్లాట్ ఫాంలతో భవనం నిర్మించారు. పెరిగిన ప్రయాణికుల సంఖ్య మేరకు సౌకర్యాలు కల్పించేందుకు బస్టాండ్ విస్తరణ చేపట్టారు. పాత భవనానికి ఆనుకుని 8 ప్లాట్‌ఫాంలతో కొత్త భవనం నిర్మించారు. ఇందుకు 2016లో ఎమ్మెల్యే షకీల్, అప్పటి ఎంపీ కవిత నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ. 25లక్షల చొప్పున మొత్తం రూ.50లక్షలు నిధులు కేటాయించారు. ఈ నిధులతో భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ ఈ భవనం ముందు సీసీ రోడ్డు వేయలేదు. సమస్యను ఇటీవల డిపో అధికారులు, ఉద్యోగులు స్థానిక ఎమ్మెల్యే షకీల్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరయ్యాయి..

కొత్త భవనం ప్లాట్‌ఫాం ముందు సీసీ రోడ్డు, రెండు కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులను కాంట్రాక్టరుకు అప్పగించారు. త్వరలోనే పనులు చేపడుతాం.

– శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం, బోధన్

గిరిజనుల అభివృద్ధికి సీఎం కృషి

మంత్రులు సత్యవతి రాథోడ్, ప్రశాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

భీమ్‌గల్: గిరిజనుల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ విశేషంగా కృషి చేస్తున్నారని, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌కే చెల్లుతుందని, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండలంలో మంగళవారం రూ.2.50కోట్లతో 48 తీజ్, సేవాలాల్ భవనాల నిర్మాణాల కోసం మంజూరైన నిధుల ప్రొసీడింగ్ కాపీలను మంత్రులు అందజేశారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసిన బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం


దుబ్బతండాలో ప్రజలకు కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని మాజీ మంత్రి, పీసీసీ కోశాధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుబ్బ తండా గ్రామంలో మంగళవారం ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రూపొందించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడిచినప్పటికీ నేటికీ పక్కా ఇళ్ల కార్యక్రమం అమలు కాలేదన్నారు. తమ ప్రభుత్వం వస్తే అవినీతి పాలనను అంతమొందించడమే కాకుండా ప్రజలకు జాబుదారీగా ఉంటామన్నారు. మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్లుప్తంగా

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం



రుద్రూర్: మండలంలోని సిద్దాపూర్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీల నాయకులు 'గడప గడపకు కాంగ్రెస్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో గురించి, ప్రజలకు వివరించారు. నాయకులు చంద్రశేఖర్, అరుణ్‌కుమార్, సాయిలు, అశోక్, ప్రవీణ్, నితిన్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి మండలంలో..



వేల్పూర్: కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్‌లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు 'పల్లె పల్లెకు కాంగ్రెస్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అవినీతి రహిత పాలన సాధ్యమని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్ల విస్తరణకు రూ.69.25 కోట్లు

వర్ని: బాన్సువాడ నియోజకవర్గంలోని ఆర్ అండ్‌బీ రోడ్ల విస్తరణకు రూ.69.25 కోట్లు మంజూరు అయినట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. పాత వర్ని నుంచి ఘన్పూర్ రోడ్డు వరకు రూ.9.92 కోట్లు, వర్ని నుంచి కోటగిరి వయా తగిలేపల్లి రోడ్డుకు రూ.18.68 కోట్లు, కోటగిరి నుంచి ఎత్తొండ రోడ్డుకు రూ.8.92 కోట్లు, బుడిమి నుంచి కొత్త బాది వరకు రూ.9.33 కోట్లు, నస్రుల్లాబాద్ నుంచి పోతంగల్ వయా బీర్కూర్ రోడ్డుకు రూ.10.90 కోట్లు, వర్ని నుంచి మొండి సడక్ వరకు రూ.11.50 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదలైనట్లు స్పీకర్ వెల్లడించారు.

ఉపాధ్యాయుల నిరసన

బాల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం 5శాతం ఐఆర్ ప్రకటించడంపై మండలంలోని బస్సాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఖమేశ్, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

15న యాదవ వివాహ పరిచయ వేదిక



బాల్కొండ: జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15న ముప్కాల్‌లోని జీఎన్ఆర్ గార్డెన్‌లో యాదవ వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు యాదవ సంఘం జిల్లా కోశాధికారి కట్ట మహేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 10వరకు వధూవరుల కుటుంబ సభ్యులు పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9398373131 నంబర్‌ను సంప్రదించాలన్నారు. వేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విపక్ష నేతల ముందస్తు అరెస్టులు



మాక్లూర్/నందిపేట్/వర్ని/బోధన్‌టౌన్(బోధన్): ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో పోలీసులు మంగళవారం తెల్లవారుజామున వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు, సమ్మె నిర్వహిస్తున్న కార్మికులను ముందస్తు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం నిజామాబాద్‌లో పర్యటన సందర్భంగా వారిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిని మధ్యాహ్నం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

దివ్యాంగులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలి

బోధన్: దివ్యాంగులకు నెలకు రూ.10వేల పింఛన్, ఉచిత విద్యుత్, ప్రయాణ సౌకర్యం కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కవిత, గైని రాములు డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నా తలపెట్టామని తెలిపారు. ఈమేరకు పట్టణంలో మంగళవారం మహాధర్నా కరపత్రాలను వారు ఆవిష్కరించి, మాట్లాడారు. మహాధర్నాకు అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నామని, దివ్యాంగులు తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు చింతకుంట రాములు, షేక్ నజీర్,గోపాల్ గౌడ్, నేహాల్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల డిమాండ్లు నెరవేర్చండి


బోధన్ ఎమ్మెల్యే షకీల్‌కు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు

బోధన్: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు పట్టణంలో చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. ఈసందర్భంగా వారు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షకీల్ నివాసం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే షకీల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజమణి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు ఉద్యోగభద్రత, ఫిక్స్‌డ్ వేతనం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. నాయకులు జంగం గంగాధర్, యేశాల గంగాధర్, నన్నేసాబ్, దివ్య, విజయ, రాజేశ్వరి, సుధమ్మ, లావణ్య, సవిత పాల్గొన్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు


ఆర్మూర్ నుంచి వెళుతున్న బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి బీజేపీ శ్రేణులు, ప్రజలు మంగళవారం నిజామాబాద్‌లో నిర్వహించిన ప్రధాని మోదీ సభకు తరలివెళ్లారు. స్థానిక పార్టీ నాయకులు ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేయగా, అందులో పార్టీ శ్రేణులు, ప్రజలు నిజామాబాద్‌కు వెళ్లారు.

మోదీకి స్వాగతం పలికిన మేడపాటి..

బోధన్: నిజామాబాద్‌కు విచ్చేసిన ప్రధాని మోదీకి మంగళవారం బోధన్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

బండి సంజయ్‌కు సన్మానం..

కమ్మర్‌పల్లి: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను కమ్మర్‌పల్లి బీజేపీ నాయకులు మంగళవారం రాత్రి సన్మానించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన ప్రధాని మోదీ సభను ముగించుకొని తిరుగు ప్రయాణంలో కరీంనగర్ వెళ్తున్న ఎంపీ సంజయ్‌ను కమ్మర్‌పల్లిలో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు నవాతే రంజిత్ కుమార్ కలిశారు. ఈసందర్భంగా రంజిత్‌తో పాటు, బీజేపీ నాయకులు ఆయనను సన్మానించారు. కార్యకర్తలు, నాయకులు సెల్ఫీలతో సందడి చేశారు. నాయకులు శ్రీరాముల సుమన్, మారంపల్లి శ్రీను, చింత నవీన్, చిటికెశి రఘు, కొమ్ముల రాజన్న, విశ్వనాథ్, సిలివేరి వినోద్, నల్ల నాగభూషన్ తదితరులు ఉన్నారు.



నగరంలో మోదీకి స్వాగతం పలుకుతున్న ప్రకాష్‌రెడ్డి.. కమ్మర్‌పల్లిలో బండి సంజయ్‌తో పార్టీ నేతలు

అభివృద్ధి, సంక్షేమమే నా ప్రచారాస్త్రాలు

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నేతలు

ఆర్మూర్/నందిపేట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ప్రచార అస్త్రాలని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంకాపూర్‌లోగల ఆయన నివాసంలో మంగళవారం పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా నందిపేటకు చెందిన మాదిగ సంఘం సభ్యులు, ఖుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘ సభ్యులు, నికాల్‌పూర్ గ్రామానికి చెందిన అంబేడ్కర్ మాల సంఘ సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా తీర్మానాలు చేసి, కాపీలను ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం వారు బీఆర్ఎస్‌లో చేరగా.. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి, బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

ఆర్మూర్‌లో ప్రజా ఆశీర్వాద యాత్ర..

ఆర్మూర్: పట్టణంలోని 3వ వార్డు పరిధిలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి 'నమస్తే నవనాథపురం' కార్యక్రమంలో భాగంగా ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. పార్టీ శ్రేణులు, వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, వైస్‌చైర్మన్ షేక్‌మున్ను, బీఆర్ఎస్ నాయకులు లింబాద్రిగౌడ్, పూజ నరేందర్, లింగాగౌడ్, గంగామోహన్‌చక్రు, పండిత్ పవన్ ఉన్నారు.

ప్రచారంలో సోషల్ మీడియా కీలకమైనది

ఎన్నికల సమయంలో ప్రచారానికి, సమాచారాన్ని సామాన్య జనానికి చేరవేయడంలో సోషల్ మీడియా కీలకమైన భూమిక పోషిస్తోందని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా వారియర్స్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. బీఆర్ఎస్ పథకాలను సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలన్నారు.

నిధులు మంజూరు..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌లో 1104 యూనియన్ సంఘ భవనానికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశా రు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యూనియ న్ నాయకులకు నిధుల మంజూరు ప్రొ సీడింగ్ కాపీని అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. యూని యన్ అధ్య క్ష, కార్యదర్శులు సంజీవ్, నరేంద్ర నాయక్, నాయకులు వేణుగోపాల్, గంగారాం, నర్సయ్య, ప్రభాక ర్ రెడ్డి, సంతోష్, సుధాకర్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



ఆర్మూర్‌టౌన్: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఆర్మూర్‌లో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారం 23వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ ఎల్లయ్య మాట్లాడుతూ.. అంగన్‌వాడి టీచర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ సభ్యులు చంద్రకళ, కార్యదర్శి లక్ష్మి, సునంద, లావణ్య, అరుణ, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంప్యూటర్ ఆపరేటర్ల సమ్మె


ధర్నా చేస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (ఈ-పంచాయతీ), ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సమ్మె మంగళవారం 5వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రాజెక్ట్ మేనేజర్లకు పేస్కేల్ అమలుచేయాలని, ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేసి ప్రత్యేక గ్రాంట్ ద్వారా వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. సంఘ ప్రతినిధులు ప్రసాద్, సురేష్, అనిల్, కిరణ్, సతీష్, నితీష్, ప్రశాంత్ కుమార్, రాజశేఖర్, రంజిత్, శివకుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు అందించాలి


రెంజల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నీలా గ్రామస్తులు

రెంజల్(బోధన్): మండలంలోని నీలా గ్రామంలో నిరుపేద బీడీకార్మిక కుటుంబాలకు ఇళ్ల స్థలాలు అందించాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్, నసీర్‌లు తహసీల్దార్ రాంచందర్, కార్మికులు లక్ష్మీ, అంజనీబాయి, సంగీత, రాధ, సావిత్రి పాల్గొన్నారు.

ప్రధాని పచ్చి అబద్ధాల కోరు!

- కేసీఆర్‌పై పీఎం వ్యాఖ్యలు సరికావు
- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం: 'నిజామాబాద్ సభలో సీఎం కేసీఆర్‌పై ప్రధాని మోదీ నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని, ప్రధాని పచ్చి అబద్ధాల కోరని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని స్థాయి వ్యక్తి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పచ్చి అబద్ధాలు మాట్లాడడం అత్యంత హేయనీయమన్నారు. కేసీఆర్ ఎన్డీయేలో కలుస్తానని చెప్ప డం పచ్చి అబద్ధమని, ఎన్డీయేలో కలవమని మీరు బ్రతిమిలాడితే దేశాన్ని అమ్మే వారితో కలవమని కేసీఆర్ ఖరాఖండిగా చెప్పారన్నారు. నిజామాబాద్‌లో హెలికాప్టర్ దిగిన మోదీకి, కేసీఆర్ కట్టిన కలెక్టరేట్, కేటీఆర్ కట్టిన ఐటీ టవర్ చూసి కన్నుకుట్టి కహానీలు చెప్పిండన్నారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలంటే ప్రధాని సాయం ఎందుకు అన్ని ప్రశ్నించారు. బీజేపీ ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో బీఆర్ఎస్ గెలుపు ఆపలేరని స్పష్టం చేశారు.

ఆస్పత్రి స్థలంపై విచారణ

నవీపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ సీహెచ్‌సీ స్థలంపై డిప్యూటీ సర్వేయర్ వెంకటేశ్వర్‌రావ్ మంగళవారం విచారణ చేశారు. ఆస్పత్రి స్థలాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని కలెక్టర్‌కు ఆస్పత్రి సిబ్బంది, స్థానికులు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని వారు పరిశీలించి, హద్దులను ఏర్పాటు చేశారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తానని డిప్యూటీ సర్వేయర్ పేర్కొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

నవీపేట: మండలంలో బతుకమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలానికి 18,600ల చీరలు వచ్చాయన్నారు. అన్ని జీపీలకు పంపిణీ చేసి, అర్హులకు అందజేస్తామని పేర్కొన్నారు. ఎంపీడీవో సాజిద్ అలీ, తహసీల్దార్ లు దన్వాల్, ఐకేపీ ఏపీవో భూమేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

ఆధ్యాత్మికం..

- ఘనంగా పోచమ్మ పండుగ



రుద్రూర్: పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో మంగళవారం పురుగుల పోచమ్మతల్లి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఆలయానికి భారీగా తరలివచ్చి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. పంటలకు చీడపీడలు ఆశించకుండా చూడాలని, పంటలు అధిక దిగుబడి ఇవ్వాలని ప్రార్థించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వరి కోతలు షురూ!



రెంజల్(బోధన్): మండలంలో వానాకాలం సీజన్ లో వేసిన వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. ముందస్తుగా దొడ్డు రకం వంగడాలను నాటిన పంటలు చేతికందడంతో పలువురు రైతులు మంగళవారం వరి కోతలు ప్రారంభించారు. మరో 20 నుంచి 30 రోజుల్లో సన్న రకం పంటలు చేతికందుతాయి. మండలంలో ఈ సీజన్‌లో 14,421 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సకాలంలో అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఫుక్రే-3 (హిందీ) - 12.30, 7.10, 10.25 జవాన్ (తెలుగు)- 3.45
స్క్రీన్-2 –	స్కంద - 11.00, 2.30, 6.00, 9.30
స్క్రీన్-3 –	పెదకాపు1- 12.40, 7.20, 10.30 స్కంద - 03.50
స్క్రీన్-4 –	చంద్రముఖి2 (తెలుగు)- 11.45, 3.05, 6.25, 9.45

సంక్షిప్తం

విద్యార్థులకు వైద్యపరీక్షలు

కోటగిరి(రుద్రూర్): మండలంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో మంగళవారం మండల ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రెంజల్(బోధన్): మండలంలోని కూనేపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం సర్పంచ్ రొడ్డ విజయ అందజేశారు. ఉప సర్పంచ్ మల్లేశం, కార్యదర్శి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వర్ని: మోస్రా మండలంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆర్ఎస్ఎస్ అధ్యక్షులు పిట్ల శ్రీరాములు, గోవూరు సర్పంచ్ నరేందర్‌రెడ్డి అందజేశారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వర్ని: సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న తలపెట్టిన చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను మంగళవారం వర్నిలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు కవిత ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షులు రాములు, పెరికరాములు తదితరులు పాల్గొన్నారు.

రుణాల చెక్కుల అందజేత

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు రుణాల చెక్కులను మంగళవారం సంఘం చైర్మన్ గంగాధర్ అందజేశారు. డైరెక్టర్లు, సీఈవో గంగాధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లో ఇటీవల నిర్వహించిన ఎల్ వెంకట్రామ్‌రెడ్డి స్మారక రాష్ట్రస్థాయి ఆహ్వానిత వాలీబాల్ పోటీల్లో ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం హరిత మంగళవారం తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

జిల్లా స్థాయి స్పార్క్ ఫెస్టివల్‌లో..

రుద్రూర్: కోటగిరి మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలకు చెందిన షేక్ ఇర్ఫాన్ జిల్లా స్థాయి స్పార్క్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబరి,చి మొదటి స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ ముబీన్ తెలిపారు. దీంతో విద్యార్థి రాష్ట్ర స్థాయి స్పార్క్ టెస్ట్‌కు అర్హత సాధించినట్టు వెల్లడించారు.

స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో..

వర్ని: జిల్లాస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాల్కొండలో నిర్వహించిన క్రీడల్లో వర్ని జోన్ క్రీడాకారులు సత్తా చాటారు. 8 ఈవెంట్లు జరగగా అండర్ 17 బాలుర కోకో , అండర్ 14 బాలుర కోకో, అండర్ 17 బాలుర కబడ్డీలో ప్రథమ బహుమతిని సాధించారు. విజేత జట్లకు సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సంగీతరావు షీల్డ్‌లను అందజేశారు.

కుట్టు మిషన్ల పంపిణీ

బాల్కొండ: మండల పరిధిలోని పలువురు ముస్లిం మహిళలకు మంగళవారం కుట్టు మిషన్లను ఎంపీపీ లావణ్య పంపిణీ చేశారు. జెడ్పీటీసీ దాసరి లావణ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.